"నువ్వు ఈ కుక్కని రాళ్ళతో కొట్టావా?" గద్దిస్తూ అడిగాడు రాజు.

"నిజమే. సరదాకి దీని మీదకి రాళ్ళు విసిరాను." ఆ తాగుబోతు ఒప్పుకున్నాడు.

"ఇతనికి ఏం శిక్ష వేయమంటావు?" కుక్కని అడిగాడు రాజు.

"వీడిని ఓ మఠానికి అధిపతిగా చెయ్యడం వీడికి సరైన శిక్ష."

భటులు తాగుబోతుని తీసుకువెళ్ళాక రాజు కుక్కని ఆశ్చర్యంగా అడిగాడు.

"మఠాధిపతి అయితే ఐశ్వర్యం, సేవకులు, సమస్త సౌకర్యాలు వాడు అనుభవిస్తాడు కదా? అది శిక్ష ఎందుకు అవుతుంది?"

అందుకా కుక్క జవాబు చెప్పింది.

"మఠాధిపతిగా ఉన్నవాడు నియమ నిబంధనలని పాటించి ఆధ్యాత్మికంగా ఉన్నత గతి పొందేలా జీవించాలి. గృహస్తు తప్పు చేస్తే మళ్ళీ మనుష్య జన్మ రావచ్చు కాని, ధర్మాన్ని బోధించాల్సిన మఠాధిపతి భౌతిక సుఖాలకి ఆశపడి తప్పు చేస్తే మాత్రం తర్వాతి జన్మలో కుక్కగా పుట్టక తప్పదు. నేను గత జన్మలో అలాంటి మఠాధిపతినే."

## 24. దీవెనలు

"స్వామీ. దేవుడు మనిషి కోరుకునేవాటిలో కనీసం కొన్నయినా ఫలించేలా ఏర్పాటు చేస్తే ఎంతో బావుండేది."

"ఏం బావుండేది కాదు కాబట్టే ఆ ఏర్పాటు చేయలేదాయన. అదే జరిగి వుంటే, ఈ ప్రపంచంలో ఒక్కరూ బ్రతికివుండరు."

"అదేమిటి స్వామీ?"

"అవును. కష్టం వచ్చినప్పుడు ప్రతీ మనిషి 'నేను చస్తే బావుండును' అని కోరుకుంటాడు కదా? తక్షణం కోరిన కోరికల్లా తీరుతూంటే, ప్రతీ మనిషి

వెంటనే చచ్చి వుండేవాడు. దేవుడు నీకన్నా, నాకన్నా తెలివైనవాడు కాబట్టే మనం కోరిన ఏ ఒక్క కోరికా తీర్చడు. కోరక పోయినా మనకి అవసరమైనవన్నీ తీరేలా చేస్తాడు. తీరని కోరికలన్నీ దేవుడి దీవెనలు."

## 25. ఉషోదయం

కొందరు భక్తులు కార్తీక పౌర్ణమికి శ్రీశైలం వెళ్తూ, దారిలో కనబడ్డ ఓ ఆశ్రమాన్ని చూసి బస్సు ఆపించి, అంతా లోపలికి వెళ్ళారు. ఆ ఆశ్రమంలోని ఓ సన్న్యాసిని చూసి తమని తాము పరిచయం చేసుకున్నాక, కాసిని మంచి మాటలు చెప్పమని కోరారు.

"మనం ఎప్పుడు చీకటి పోయి వెలుతురు వచ్చిందని గ్రహించగలం?" ప్రశ్నించాడా సన్న్యాసి.

"గాడిదో, గుర్రమో స్పష్టంగా తెలుసుకున్నప్పుడు." చెప్పారు ఒకరు.

"తప్పు."

ఇంకొకరి వైపు చూసాడు సన్న్యాసి.

"మామిడి చెట్టో, మర్రి చెట్టో స్పష్టంగా తెలుసుకోగలిగినప్పుడు." చెప్పాడతను.

మళ్ళీ ఆ సన్న్యాసి చిరునవ్వుతో తల అడ్డంగా ఊపాడు.

"సరైన సమాధానం మీరే చెప్పండి."

"ఏ మగాడి మొహాన్ని చూసినా, మీ సోదరుడిని, అలాగే ఏ ఆడదాని మొహం చూసినా మీ సోదరిని చూడగలిగినప్పుడు, మీలోని చీకట్లు తొలగి, వెలుగు పూర్తిగా ప్రవేశించినట్లు అర్థం." వివరించాడా సన్న్యాసి

## 26. జ్ఞాని

ఋషికేశ్‌లో గంగానది ఒడ్డున ఉన్న ఓ యోగికి వీపు మీద చిన్న కురుపు లేచింది. ఆ వ్రణం తగ్గకుండా క్రమేపీ పెరగసాగింది. అవసాన